



సీతారం ఏచూరి సంతాప సభలో పాల్గొన్న వామపక్ష మద్దతుదారులు, లౌకిక వాదులు, ప్రజాసంఘాల నాయకులు



ఉద్యమ కెరటం సీతారాం ఏచూరి

- జీవితమంతా నిస్వార్థ, నిర్విరామ పోరాటం
- కార్మిక, కర్షక, ప్రజల గొంతుక
- ఆయన ఆశయాలకు పునరంకితం అవుదాం
- సంతాప సభలో వక్తలు
- సిపిఎం ఆధ్వర్యంలో ఘన నివాళులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రజా పోరాటాల్లో ఉద్యమ కెరటంగా నేటి తరానికి ఆదర్శప్రాయుడైన నాయకుడిగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు సిపిఎంతోపాటు సిపిఐ, సిపిఐ ఎంఎల్, ఎస్‌యుసిఐ, వైసిపి, టిడిపి నాయకులతోపాటు ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంతాప సభకు హాజరైన ప్రజాప్రతినిధులు, వామపక్ష, లౌకిక వాదులు, ప్రజాసంఘాలు, కవులు, రచయితలు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి విద్యార్థి, ఉద్యమ, రాజకీయ నేపథ్యంను కొనియాడారు.



కాలవ శ్రీనివాసులు



అనంత వెంకటరామిరెడ్డి

తెలుగు కీర్తిని చాటిన సీతారాం : కాలవ

ఢిల్లీలో దక్షిణ భారతదేశం పార్లమెంటేరియన్లపై చులకన భావం, చిన్నచూపు నెలకొన్న పరిస్థితుల్లో తెలుగు వాడైన ఏచూరి ప్రతిభతో ఆ సంస్కృతిని అంతమొందించి తెలుగు కీర్తిని దేశం అంతటా చాటిన ఆదర్శవంతమైన నాయకుడని మాజీ మంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పార్లమెంటేరియన్‌గా, వామపక్ష నాయకుడిగా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. నూతన ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశానికి జరిగే ఉపయోగాల కన్న నష్టాలు అధికంగా ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేసి పాలక ప్రభుత్వాలను ఎదురించి ప్రశ్నించిన దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడన్నారు.

ప్రజా హితం కోసం తపన : అనంత

సీతారం ఏచూరి నిరంతరం ప్రజా హితం కోసం పరితపించారని మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఏచూరి ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేశారన్నారు. తాను 2004లో పార్లమెంటు సభ్యులుగా ఉన్న సమయంలో ఆయన్ను దగ్గరగా గమనించానని తెలియజేశారు. అప్పట్లో కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ తీసుకురావడంలో, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం రూపకల్పనలోనూ కీలకంగా పనిచేసారని గుర్తు చేశారు. సమాజ శ్రేయస్సు కోసం మొక్కవోని దీక్షతో పోరాడిన యోధుడన్నారు.

నేటి తరానికి ఆదర్శనీయుడు : గేయానంద్

సీతారాం ఏచూరి నేటి తరానికి ఆదర్శనీయుడని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడి పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆర్థిక అసమానతలు, సామాజిక రుగ్మతలు తొలగిపోయి సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని చివరి వరకు పరితపించిన వ్యక్తి అన్నారు.

సిద్ధాంతంపై నిక్కచ్చితనం : విశ్వ

తాను నమ్మని కమ్యూనిజం సిద్ధాంతం కోసం నికచ్చితనంతో జీవితాంతం వరకు నిలిచిన వ్యక్తి సీతారం ఏచూరి అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. 2004లో తాను సిపిఎం తరుపున ఉరవకొండ నియోజకవర్గంలో పోటీ చేసిన సమయంలో ప్రచారానికి విచ్చేసారని గుర్తు చేశారు. సిద్ధాంతం పట్ల నిఖచ్చికంగా ఉండటమే కాకుండా వాటిని దేశంలో అమలుకు కృషి చేసిన వ్యక్తిని తెలిపారు.

దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజాగొంతుక గొప్ప నాయకుడు ఏచూరిని కోల్పోవడం బాధాకరం అన్నారు.

ఏచూరి స్ఫూర్తితో ముందుకు : రాంభూపాల్

సీతారం ఏచూరి పోరాటం, ముందు చూపును స్ఫూర్తిగా తీసుకుని తాము ముందుకు సాగుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బిజెపియేతర రాజకీయ పార్టీలన్నీ ఒక వేదికపై వచ్చి సీతారాం ఏచూరికి నివాళి అర్పించడం చూస్తే దేశంలో ఆయనకున్న స్థానం ఏమిటో తెలుస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచి తాను నమ్మిన వామపక్ష రాజకీయాల్లో చివరి వరకు నడిచారన్నారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, లౌకితత్వానికి విఘాతం కలిగిస్తాయని ఏచూరి చెప్పారన్నారు.

మార్క్సిజాన్ని నమ్మిన నేత : శైలు

సమాజాన్ని అనేక రుగ్మతల నుంచి కాపాడటానికి మార్క్సిజం ఒకటే బలమైన సిద్ధాంతంగా అని నమ్మి చివరి వరకు అ పంతాలో నడిచిన నాయకుడు ఏచూరి అని మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ కొనియాడారు. సీతారం జీవితం తనకు స్ఫూర్తి అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలనే దిశానిర్దేశం చేసిన గొప్ప ప్రజాతంత్ర ఉద్యమకర్తగా ఏచూరి నిలిచారన్నారు.

చనిపోయినా జీవించిన నాయకుడు : జాఫర్

సీతారాం ఏచూరి చనిపోయినా ఆయన ప్రజా ఉద్యమ పోరాటం ఉన్నంత వరకు గుర్తుంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ తెలిపారు. వామపక్ష నాయకులు బతికున్నప్పుడే కాకండా చనిపోయిన తరువాత కూడా ప్రజల కోసం జీవించి ఉంటారని చెప్పడానికి సీతారాం ఏచూరి జీవితం ఆదర్శమన్నారు. ఆయన చనిపోయాక పార్థివ దేవహాన్ని ఎయిమ్స్‌కు అప్పగించడమే ఇందుకు సాక్ష్యమని చెప్పారు.

విద్యార్థి దశ నుంచే పోరాటం : చంద్రశేఖర్

విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాటం సాగించి, అందులో విజయం సాధించిన నాయకుడు సీతారాం ఏచూరి అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. ఏచూరి జెఎన్‌యులో చదువుతున్న సమయంలోనూ తానూ అక్కడే చదివానని గుర్తు చేసుకున్నారు. ఈ సమయంలో విద్యార్థి నాయకుడిగానే ఆయన సాగంచిన పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. హేతుబద్ధమైన చర్చలు నిర్వహించడంలో ఆయన కీలకంగా వ్యవహరించేవారని తెలిపారు. ఇందిరాగాంధీని రాజీనామా చేయించిన ధైర్యశాలి ఏచూరి అన్నారు.

నిర్దిష్టమైన విశ్లేషణతో ముందుకు : బోస్

వామపక్ష వాదమంటే కేవలం పిడివాదంగానే కాకుండా నిర్దష్టమైన పరిస్థితుల్లో నిర్ధిష్టమైన విశ్లేషణతో ముందుకెళ్లే నాయకుడుగా ఆచరణలో చేసిన చూపిన వ్యక్తి సీతారాం ఏచూరి సామాజికవేత్త బోస్ తెలిపారు. దేశంలో వర్గ పోరాటమే కాకుండా సామాజిక పోరాటమూ అవసరమని చెప్పిన గొప్ప వామపక్ష వాది ఏచూరి అని తెలిపారు.

రాజకీయ, అర్థశాస్త్రాలపై పట్టు : ఓబులు

రాజకీయ, అర్థశాస్త్రంలో నైపుణ్యత కలిగిన ప్రజ్ఞాశాలి సీతారం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. దేశ వర్థమాన రాజకీయాలను ముందుగా అంచనా వేయడం, విశ్లేషించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం దేశంలో సర్వమతాలు సమానంగా విరాజిల్లాలనే జన చైతన్యం కల్పించిన మహానేత అని కొనియాడారు.

మతోన్మాదాన్ని ఎండగట్టిన నేత : రాఘవేంద్ర

దేశ లౌకిక స్ఫూర్తిని తెలియజేస్తూ మతోన్మాదాన్ని ఎండగట్టిన గొప్ప నాయకుడు ఏచూరి అని ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. మతోన్మాదం పెరిగిపోయి లౌకికత్వాన్ని దెబ్బతీసే ధోరణలను ఆయన నిత్యం ప్రశ్నించారని తెలియజేశారు. సమసమాజ స్థాపనకు జీవితం త్యాగం చేశారని కొనియాడారు.

పలువురి నివాళి


సీతారాం ఏచూరి సంతాప సభలో వక్తలతో పాటు పలువురు నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సావిత్రి, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, ఐఎఫ్‌టియు కార్యదర్శి ఏసురత్నం, సిపిఐఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, లలితకళాపరిషత్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచాపాళెం చంద్రశేఖర్, డాక్టర్ ప్రసూన, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, డాక్టర్ బానుకిరణ్, మానవ హక్కుల వేదిక ఎస్‌ఎం.బాషా, వికే.రంగారెడ్డి, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు క్యాప్టన్ షేకన్న, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, రచయిత కంబదూరి నబీరసూల్, మానవతా తరిమల అమర్‌నాథ్‌రెడ్డి, మహాబోది కృష్ణమూర్తి తదితరులు నివాళులు అర్పించారు.



శైలజనాథ్



విశ్వేశ్వరరెడ్డి



చంద్రశేఖర్



వి.రాంభూపాల్



డా॥గేయానంద్



జాఫర్



బోస్



జి.ఓబులు



రాఘవేంద్ర

సంక్షోభంలోనూ సంక్షేమం
సిఎం చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి-రొద్దం

సంక్షోభంలోనూ సంక్షేమం అందించడం సిఎం చంద్రబాబుకే సాధ్యమని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. మండలంలోని కోగిర గ్రామంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టగా మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల చేత 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకున్నామన్నారు. నిరుద్యోగ యువత కోసం 16,437 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన, పింఛన్ల మొత్తం పెంపు, అన్న క్యాంటీన్, ఉచిత ఇసుక విధానం అమలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పించామని తెలపారు. పోలవరం, అమరావతి రాజధాని పనులతో పాటు గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి సిఎం చంద్రబాబు పెద్దఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో రూ. 23.31 కోట్లతో 41.5 కి.మీ మేర రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో కోగిర రైతులు అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, నరసింహులు, వెంకటరామి రెడ్డి, టైలర్ ఆంజనేయులు, ఎల్ఐసి ఆంజనేయులు, పవన్, శ్రీనాథ్‌గుప్తా, కంబాలపల్లి సర్పంచి మంజు, నాగరాజు, మంజు, జనార్దన్, అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి సవిత



బస్సులో ప్రయాణికుడికి 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్ ఇస్తున్న మంత్రి సవిత

వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు ట్రాయ్ కృషి

ప్రజాశక్తి-సోమందేపల్లి

వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రాయ్ కృషి చేస్తుందని బిఎస్ఎన్ఎల్ జెటిఒ ఉమాప్రసాద్, సిఐజి మెంబర్ శారద తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వినియోగదారుల సేవలు, హక్కులు, సంబంధిత విషయాలను తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఒ రామాంజనే యులు, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ బాబు, వైస్ ప్రెసిడెంట్ హరికృష్ణ, కార్యదర్శి సాయిచరణ్, ఈసీ మెంబర్స్ లక్ష్మీ, హనుమంతరెడ్డి, ట్రెజరర్ శివ ప్రసాద్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. పెనుకొండ మండలంలోని గోనిపేట గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరుతూ బిఎస్ఎన్ఎల్ జెటిఒ ఉమాప్రసాద్, సిఐజి మెంబర్ శారదకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.



మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపి బికె.పార్థసారథి, టిడిపి నాయకులు

మృతుని కుటుంబానికి ఎంపి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఈ.చిన్నప్పయ్య తమ్ముని కుమారుడు ప్రమోద్(33) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం ఎంపి బికె.పార్థసారథి వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి వెంట జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, మండల సీనియర్ నాయకులు రామకృష్ణ, మాధవ నాయుడు, చంద్రిమౌళి, వెంకటరామిరెడ్డి, నరసింహులు, వీరాంజి, ఈ.హరీష్, ఈ.పవన్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నూతన సిఐకు సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణ నూతన సిఐ రామారావుని శుక్రవారం ఆయన కార్యాలయంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హనుమంతు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. హనుమంతు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దళితుల సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. మట్కా, గుట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలప్ప, శ్రీనివాస్, రామాంజనప్ప, గోపి, మూర్తి, పాల్గొన్నారు.



సిఐను కలిసిన డిహెచ్‌పిఎస్ నాయకులు

చంద్రబాబు పాలనలో పల్లెల్లో ప్రగతి

నేను పాలకుడిని కాదు ప్రజా సేవకుడిని : ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

ప్రతి పల్లెను ప్రగతి బాట పట్టిస్తున్న గొప్ప వ్యక్తి సిఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారున. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వంద రోజుల్లోనే ఫించన్ల మొత్తం పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం ఏర్పాటు, తదితర ఎన్నో ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ప్రవేశ పెట్టామన్నారు. సిఎం చంద్రబాబు సంపదను సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లు, వక్క మార్కెట్, మడకశిరలో పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు నాంది పలికామన్నారున. నియోజకవర్గాన్ని గత ఎమ్మెల్యే అవినీతిమయం చేశారని విమర్శించారు. అవినీతిని ప్రక్షాళన చేసి అభివృద్ధి చేయడమే మా లక్ష్యం అన్నారు. హరేసముద్రం సమీపంలో త్వరలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇక్కడి భూముల రైతులకు ఆదాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రామగిరి, టిడి.పల్లి, హెచ్‌ఆర్ పాల్యంలో 48 గంటల్లో మూడు బోర్లు తవ్వించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైసిపి ప్రభుత్వంలో పంచాయతీలకు ఒక్క రూపాయి ఇవ్వకుండా పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వివిఎం పాండురంగప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సోనియాబాయి, కౌన్సిలర్ నరసింహరాజు, భక్తర్‌సాబ్, కోట్ల రంగయ్యగౌడ్, మంజునాథ్, భాస్కర్‌రెడ్డి, ఆసుపత్రి కమిటీ మెంబర్లు మంజునాథ్, కృష్ణమూర్తి, అశ్వత్థామప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

కల్లుమర్రిలో పౌష్టికాహార వారోత్సవాలు

మడకశిర : మండలంలోని కల్లుమర్రి అండన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. హెల్త్ సూపర్వైజర్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి స్రవంతి, హెల్త్ సూపర్వైజర్ రామప్రసాద్, అంగన్వాడీ వర్కర్లు ఉష, నాగమణి, సిద్దుగంగమ్మ, పార్వతమ్మ, ఆశా వర్కర్లు శాంతమ్మ, కవితమ్మ పాల్గొన్నారు. అలాగే మండలంలోని చంద్రకచర్ల పంచాయితీలో గ్రామ హెల్త్ న్యూట్రిషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచి, ఎఎన్ఎం జుబేదావేగం, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి, హెల్త్ సూపర్వైజర్ సరస్వతి, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

అమరాపురం : మండలంలోని మద్దనకుంట-అమరాపురం ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మునిరత్నం ఆధ్వర్యంలో తొలగింపు పనులు చేపట్టారు. అమరాపురం-హేమావతి రహదారిలో మద్దనకుంట గ్రామం మలుపు వద్ద రోడ్డుకు ఇరు వైపులా పెరిగిన ముళ్లపొదలతో రాకపోకలకు వాహనదారులు తీవ్రఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని టిడిపి నాయకులు రఘు, మాజీ సర్పంచి శకునప్ప పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన జెసిబి సాయంతో ముళ్లపొదల తొలగింపు చర్యలు చేపట్టారు. పనులను పంచాయతీ కార్యదర్శి మునిరత్నం, మాజీ సర్పంచ్ శకునప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.రంగారెడ్డి పర్యవేక్షించారు.

పోస్ట్ ఆఫీసులో 'ఆధార్' సేవలు

గుడిబండ : స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ కార్డ్‌కు సంబంధించి అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్‌మాస్టర్ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ అధికారి సి.నింగేశ్వర్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆధార్ సేవలను పోస్ట్ ఆఫీస్ పరిధిలోని వినియోగదారులే గాక ఇతరులు వినియోగించుకోవచ్చన్నారు. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ మార్పు చేసుకోవచ్చన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఐరీశ్ కెమెరా ద్వారా ఆధార్ కార్డు తీస్తారన్నారు. వివరాలకు గుడిబండ సబ్ పోస్ట్ ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

సర్వేయర్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం మండలంలోని తమ్మడేపల్లి లో సర్వేయర్‌గా పనిచేస్తున్న పవన్ గురువారం విద్యు దాఘాతంతో మృతి చెందారు. శవ పరీక్ష నిమిత్తం పట్టణంలో ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ గదిలో ఉంచిన పవన్ మృతదేహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప, కౌన్సిలర్ రాజా, భక్తర్‌సాబ్, నాయకులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి పరామర్శ

గుడిబండ మండలంలోని రాళ్లపల్లిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక వైద్య విధాన పరిషత్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి గోవిందప్పను పరామర్శించారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్లు, నాయకులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

కొత్తచెరువు తహశీల్దార్‌గా నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు తహశీల్దార్‌గా నీలకంఠారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం కలెక్టరేట్లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ నాగరాజు రాయదుర్గానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ను డిటి, ఆర్ఐ, విఆర్ఒలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలకంఠారెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, వీఆర్వోలు వేణు, చెన్నయ్య, శ్రీనివాసులు, రమేష్ రెడ్డి, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులో శ్మశానవాటిక ఏర్పాటుకు తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. కొత్తచెరువులో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ఇటీవల టిడిపి స్థానిక నాయకులు అధికారులకు వినతిని ఇచ్చారు. స్పందించిన తహశీల్దార్ స్థల పరిశీలనకు మండల సర్వేయర్ ని పంపించడంతో పుట్టపర్తి రహదారులు నాగుల కణం సమీపంలో ప్రధాన రహదారికి పక్కన1451,1457 ఈ సర్వే నంబర్లలో కొండ పోరంబోకు స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం 4.80 ఎకరాలు ఉందని ఈ స్థలాన్ని శ్మశాన వాటికకు ఎంపిక చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని టిడిపి నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, ఆర్ నాగేంద్ర, నల్లమాడ శంకర్, బోయ రాజు, కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని కెజిబివి విద్యార్థినులకు తెలుగుదేశం నాయకులు విద్యాసామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. పరిటాల శ్రీరామ్ జన్మదిన సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం డైరెక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఒ ఫక్రుబి, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి వ్యాఖ్యలు విచారకరం

ప్రజాశక్తి-హిందూపురం

అధికార బలంతో రైతు భరోసా ఉద్యోగిపై టిడిపి నాయకుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రెడ్డి జేపీసి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు పరగి మండలం శాసనకోట పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి చెందిన జిల్లా నాయకుడు అధికారబలంతో అగ్రికల్చర్ సచివాలయ ఉద్యోగి పవన్ కుమార్ రెడ్డిని అసభ్యకరంగా మాట్లాడటం విచారకరమన్నారు. ఆ నాయకుడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన పునవృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం నిర్వహించే స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొనాలని డిఆర్ఒ కొండయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు అన్ని కార్యాలయాల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడా పోటీల్లో మండలంలోని 13 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 98 మంది బాలికలు, 115 మంది బాలురులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేయడం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు దానమయ్య, రాంబాబు, జనార్ధన్, బాబా, బేబీ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మున్సిపాలిటీకి సొంత భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం పట్టణంలోని శాంతి మహల్ పక్కన గుట్ట వద్ద స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి దాదాపు 12 ఏళ్లు అవుతున్న సొంత భవనం లేనందున అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు సాయి నగర్ లో స్థల పరిశీలన చేశామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలోనే మున్సిపాలిటీకి సొంత భవనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మూర్తి, పుడా మాజీ చైర్మన్ కడియాల సుధాకర్, టిడిపి రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంబులెన్స్ రమేష్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని డబురువారిపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మ్యాజిక్స్ స్లేట్లను పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు నాగరాజు కుమారుడు సాయి వినయ్ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాధా నాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ చంద్ర, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల దర్యాప్తు సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అట్రాసిటీ కేసుల దర్యాప్తు త్వరిత గతిన పూర్తి చేసి బాధితులకు సకాలంలో పరిహారం అందేందుకు ప్రతిపాదనలు పంపాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. దర్యాప్తు పెండింగులో ఉన్న అట్రాసిటీ కేసులతో పాటు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శుక్రవారం డిఎస్పీ స్థాయి అధికారులతో ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుగొండ, పుట్టపర్తి, సబ్ డివిజన్ పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంత వరకు జరిగిన దర్యాప్తు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు స్టేషన్లల్లో కేసులు నమోదయ్యే విధంగా సంబంధిత డీఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు చేపట్టే డీఎస్పీ స్థాయి అధికారులు విధిగా సంఘటనా స్థలాలను సందర్శించాలని, ప్రత్యక్ష సాక్ష్యులను విచారణ చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి, నిందితులపై అభియోగ పత్రాలను న్యాయ స్థానాల్లో దాఖలు చేయాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండేందుకు గల కారణాలను పరిశీలించి, ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. కేసుల్లో నిందితులపై నేరారోపణలు న్యాయ స్థానంలో నిరూపణ చేసేందుకు అవసరమైన ప్రధాన సాక్షుల విచారణ చేయాలని, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, ధ్రువ పత్రాలను సంబంధిత రెవెన్యూ, మెడికల్ అధికారులు, ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి త్వరితగతిన పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అభియోగ పత్రాల తయారు చేయడంలో న్యాయ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం సకాలంలో అందేందుకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలను సిద్ధం చేసి, కలెక్టరు ఆఫీసుకు పంపాలని సకాలంలో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సివిల్ రైట్స్ డే ద్వారా ఎస్సీ ఎస్టీ కాలనీలలో గ్రామ సభలు నిర్వహించి చట్టాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. బాలికలు, మహిళలు, యువకులు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అత్యధిక ప్రాధాన్యతతో వాటిని విచారించి , ఆదశ్యమైన వారి జాడ తెలుసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రౌడీ షీటర్లు, మర్డర్ కేసులు వంటి వాటి వివరాలపై సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు కెవి. మహేష్, శ్రీనివాసులు, శివ నారాయణ స్వామి, టిడిఆర్‌బి సిఐ సతీష్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు : కలెక్టర్


దానిమ్మ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే విధంగా ఉద్యానవన పంటల సాగుపై ఎక్కువ ఆసక్తి చూపాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ రైతులకు సూచించారు. శుక్రవారం చిలమత్తూరు మండలం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని ముద్దేపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ సాగుచేసిన దానిమ్మ పండ్ల తోటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు..ఉద్యాన పంటలలో మంచి ఫలితాలు సాధించి మరింత ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తన 10 ఎకరాల భూమిలో జనవరి 2023 సంవత్సరంలో దానిమ్మ పంటను సాగు చేశారని ఏప్రిల్ 2024 పంట చేతికి వచ్చిందని అన్నారు. పంటలో ఇప్పటివరకు ఖర్చు లు పోను మొత్తానికి సంవత్సరానికి 60 లక్షలు రూపాయలు ఆదాయం లభించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో, డివిజన్, మండల, ఉద్యానవన, మైక్రో ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండలంలో రైతులు సాగు చేసిన పంటపొలాలనుకలెక్టర్ టిఎస్ చేతన్ శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని జగరాజు పల్లి సమీపంలోని కొత్తచెరువు మండలం ఓబులదేవరపల్లి గ్రామానికి చెందిన హరి వర్ధన్ రెడ్డి రవీంద్రారెడ్డిలకు చెందిన అరటి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. హరి వర్ధన్ రెడ్డి 15 ఎకరాల అరటి తోటను రెండు ఎకరాల వేరుశెనగను సాగు చేస్తున్నారు. రవీంద్ర రెడ్డికి చెందిన మొక్కజొన్న పంట సాగు చేస్తుండగా ఇరువురు పంటలను కలెక్టర్ పరిశీలించి, రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. డ్రిప్పు ఇరిగేషన్ ద్వారా పంటను సాగు చేస్తున్నామని అధిక పెట్టుబడి ఉన్న ఈపంట లాభదాయకమేనని తెలిపారు. నాలుగు నెలలు క్రితం పండించిన అరటిపంట పులివెందులకు చెందిన నాగార్జున రెడ్డి అనే వ్యక్తికి అమ్మి దళారుల చేతులలో మోసపోయామని బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నాగార్జున రెడ్డి అనే వ్యక్తి ఐదు లక్షల రూపాయలు సరుకు తీసుకువెళ్లి రూ. 2 లక్షలు మాత్రమే చెల్లించి మిగిలినది ఇవ్వకపోగా ఏలాంటి సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేస్తే అతనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతుకు హామీ ఇచ్చారు.అనంతరం రవీంద్ర రెడ్డి వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించి దిగుబడి సంతృప్తికరంగా ఉందని తెలిపారు. బావులు, బోర్లు క్రింద సాగుచేసిన వేరుశనగ పంట దిగుబడి బాగా ఉందని, మెట్ట ప్రాంతంలో వేసిన వేరుశనగ వర్షాభావంతో దెబ్బతిని రైతులు నష్టపోయారని రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అరటి, మొక్కజొన్న పంటను విక్రయించడానికి సత్య సాయి జిల్లాలో మార్కెట్ సౌకర్యం కల్పించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, డ్రిప్ ఇరిగేషన్ అధికారి, డ్రిప్ ఇరిగేషన్ జైన్ కంపెనీ మేనేజర్ రామానాయుడు, లక్ష్మీనారాయణ రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి : యుటిఎఫ్


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో ఏడీ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జరిగిన వర్కు అడ్జస్టమెంట్‌లో నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. కదిరి రూరల్ అర్బన్ ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్లు సర్దుబాటు అమలు చేశారన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక లోపాలు జరిగాయన్నారు.కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 169 మంది విద్యార్థులు ఉన్నారని నిబంధనల ప్రకారం ఒక హెచ్ఎం 5 మంది ఉపాధ్యాయులు ఉండాలని అన్నారు. కానీ సర్దుబాటు జరిగిన తరువాత అక్కడ పదిమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు మోటుకపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులు ఉన్నారని నిబంధనల ప్రకారం అక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు చూపించాలన్నారు. రాష్ట్రంలోఎక్కడ జరగని విధంగా కదిరి మున్సిపాలిటీలో ఉర్దూ మీడియం ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలకు తెలుగు మీడియం కు సంబంధించిన ఉపాధ్యాయులను కేటాయించారు. ఉర్దూ ఉపాధ్యాయులు ఉర్దూలోనే బోధించినట్లయితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎస్ఏ బయాలజీ సబ్జెక్టు ఉన్న తెలుగు మీడియం ఉపాధ్యాయుడిని ఉర్దూకు కేటాయించారన్నారు. అలాగే మొదటి రోజు లిస్టులో ఎస్ఎ బయాలజికల్ ఉపాధ్యాయులను చేర్చకుండా ఎస్‌జిటి అప్ గ్రేడ్ చేసిన తర్వాత ఎస్ఏ బయాలజికల్ టీచర్స్ ను చూపించడం వలన అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. అలాగే రొద్దం మండలం రాగి మేకలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు ఉండగా అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఇటీవల జరిగినటువంటి పని సర్దుబాటులో ఎటువంటి మార్పులు లేకుండా పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను అలాగే ఉంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, బాబు, బాబావలి, సంతోష్, జగన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి న్యాయం : ఎమ్మెల్యే కందికుంట


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఇది మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 20వ వార్డులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలు మతాలు అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని దానిని నిర్మూలించడానికి ఆ దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. వైసిపి నాయకులు ఎవరు కూడా తమకు శత్రువులు కాదని ఎవరైతే ప్రభుత్వ భూములను కబ్జా చేశారో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడ్డారో ఉద్యోగులు అడ్డం పెట్టుకొని అవినీతి అక్రమాలకు పాల్పడ్డారో అలాంటి వారే తమకు శత్రువులు అని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, కౌన్సిలర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.


రైతులు నష్టపోకుండా తగిన చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

ఎండుమిర్చి, చింతపండు లావాదేవీలకు ఆసియాలోని పేరుగాంచిన హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు, అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదని రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. రైతు సంఘం నాయకుల సూచన మేరకు శుక్రవారం ఆయన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న లావాదేవీలు, వసూలు చేస్తున్న కమీషన్లు, తదితర వాటినిపరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నష్టం జరగకుండా చూడాలని, లేకపోతే ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి త్వరలో ఒక కమిటీ వేసి అంశాలను చర్చించి అమల్లోకి తీసుకు వస్తామని తెలియజేశారు. ముఖ్యంగా మార్కెట్ యార్డులో ప్లాస్టిక్ సంచుల వినియోగం నిషేధించాలని సూచించారు. అదే విధంగా హమాలీలు రైతుల దగ్గర మిరపకాయలు, చింతపండు వంటి ఉత్పత్తులను తీసుకోకుండా డబ్బు రూపేణా కూలి నిర్ణయించాలని, గతంలో నిర్ణయించిన విధంగా కమీషన్ పర్సెంటేజ్ 4 శాతం మాత్రమే తీసుకోవాలని, ప్రస్తుతం మిరపకాయల ధరలు పడిపోవడంతో ధరలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సరుకు విక్రయించిన వెంటనే నిర్ణయించిన ధర మేరకు నగదు రూపంలో లేదా రైతుల ఖాతాకు నేరుగా జమ చేయాలన్నారు. దీనికి తోడు రైతుల కోసం మార్కెట్ ఆవరణలోనే బ్యాంకు సదుపాయం కల్పించాలని కోరారు. ఆయా అంశాలను మార్కెట్ యార్డులో అమలు చేసేందుకు త్వరలోనే మార్కెట్ అధికారులు, రైతులు, వ్యాపారస్తులు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లు ను అందరినీ కలిపి ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి, మార్కెట్ సజావుగా నిర్వహించేందుకు ఈ కమిటీ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నవీన్,జి.గణేష్, రవితేజా రెడ్డి, రైతులు, మార్కెట్ యార్డ్ అధికారులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన 'పురం' విద్యార్థి

ప్రజాశక్తి-హిందూపురం



విద్యార్థి శ్యాంసన్

హిందూపురం మండలం మణే సముద్రం గ్రామానికి చెందిన ఆర్ఎంపి ప్రసాద్ రెండవ కుమారుడు విక్టర్ శ్యాంసన్ ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రతిభ సాధించాడు. 5514 ర్యాంకు సాధించి కుప్పం మెడికల్ కాలేజీలో సీటు పొందాడు. ఈ సందర్భంగా శుక్రవారం మణేసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి విక్టర్ శ్యాంసన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని జాతీయస్థాయి పరీక్ష అయిన నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. టిడిపి మండల కన్వీనర్ అశ్వర్థ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ విక్టర్ శ్యాంసన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ రెడ్డి, కృష్ణనాయక్, భారతి, నరసింహప్ప, సునీల్, పాఠశాల చైర్మన్ సిద్దు, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు గిరిధర్ రవి, గోపి గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు దాదాపు ఆరు నెలలుగా వేతనాలు రాక పోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే బకాయి వేతనాలను చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకొని వారి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు.కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కారక్యక్రమంలో నాయకులు జెవి రమణ, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని ఖాజానగర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. ఖాజానగర్‌కు చెందిన హసీనా(46) మూడు రోజుల క్రితం సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమెను ఆత్మహత్యకు కారణమైన షేక్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ చెప్పారు.

హత్య కేసు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - కొత్తచెరువు

హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. కొత్తచెరువు పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల 11వ తేదీన నెహ్రూ నగర్ శివారు ప్రాంతాల్లో ఇటుకల బట్టి వద్ద మీర్జాపురం గ్రామానికి చెందిన బూచర్ల గంగాద్రిని బండ రాళ్లు, కట్టెలతో కొట్టి చంపారన్నారు. లక్ష్మీదేవి బూచర్ల గంగాధర్‌తో వివాహేతర సంబంధం కొనసాగించేదనిఈ క్రమంలోనే గంగాధర్ మద్యానికి బానిసై ఆమెను తరచూ వేధింపులకు గురి చేసేవాడని తెలిపారు. దీంతో లక్ష్మీదేవి మనస్థాపం చెంది గంగాధర్ ని ఎలాగైనా చంపాలని నిర్ధారణకు వచ్చిందని అందులో భాగంగా గోరంట్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తల్లి రత్నమ్మ, తమ్ముడు శంకర్ రెడ్డితో కలసి ఈనెల 11వ తేదీన గంగాధర్‌ను హత్య చేశారన్నారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ హత్య కేసులోని నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎఎస్పీ తెలిపారు. హత్య కేసును పోలీసులు అతి తక్కువ కాలంలోనే చేధించిన పోలీసులకు ఎస్పీ రత్న రివార్డు ప్రకటించినట్లు వివరించారు.

వ్యవసాయ సామగ్రి చోరీ

నల్లమాడ : మండలంలోని బాసం వారి పల్లికి చెందిన రైతు ఆముదాల జనార్ధన యాదవ్ చెందిన వ్యవసాయ పరికరాలు చోరీకి గురయ్యాయి. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రూ. 2లక్షల విలువచేసే 30 పైపులు ,15 స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులు చోరీకి గురయ్యాయి. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు బాధితుడిని పరామర్శించారు. తనకు జరిగిన అన్యాయంపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగభూషణం నాయుడు, డి శ్రీనివాసులు, బి విష్ణువర్ధన్ రెడ్డి, డి బాలిరెడ్డి, డి సురేందర్ రెడ్డి,మహేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు దయ్యాల ఉమాపతి యాదవ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం ఉమాపతి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యూత్ నాయకులు రామ్ లక్ష్మణులు, కోనంకి గంగాధర్ నాయుడు, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా హిందూపురం రూరల్ మండలం గోళాపురం గ్రామంలో శుక్రవారం గ్రామంలో పంచాయితీ కార్యదర్శి కెంచరాయప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ యువకులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో భూముల రీ వెరిఫికేషన్

ప్రజాశక్తి - చిలమత్తూరు

అసైండ్ భూములు ఫ్రీహోల్డ్ రీ-వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలని పెనుకొండ ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయం లో ఫ్రీహోల్డ్ రీ-వెరిఫికేషన్ పై ఆరా తీశారు. ప్రతిదీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని రెఫరెన్స్ గా అన్ని రికార్డులు పరిశీలన చేయాలని సూచించారు. రీ-వెరిఫికేషన్ రిపోర్ట్ ను పై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. వీఆర్వో లు క్షేత్రస్థాయిల్లో పరిశీలన చేయాలని రీ వెరిఫికేషన్ ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనంద్ బాబు, డీటీ జగన్నాథ్, రీసర్వే డీటీ యూనస్, సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జేకే పల్లి గ్రామ రెవెన్యూ పొలానికి సంబంధించిన భూమి తమదే అంటూ కొందరు నాయకులు అడ్డుతగిన నేపథ్యంతో విచారణలో ప్రభుత్వ భూమిగా తేలిందన్నారు. ఈవిషయంలో అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో ఏర్పరచుకున్న ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న ,సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య, సిపిఎం నాయకులు లక్ష్మన్న, వెంకటనారాయణ, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

వాతావరణ మార్పులతో సంక్రమించే సీజనల్ వ్యాధులపై సచివాలయ సెక్రెటరీలు ప్రజలకు సమగ్రంగా వివరించి అవగాహన కల్పించాలని జిల్లా అసుపత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న డాక్టర్ తిప్పేంద్ర నాయక్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించే విధంగా చూడడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నాగేంద్ర, శానిటరీ ఇన్స్పెక్టర్లు శంకర్, నిజాం, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెడపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధుల పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బంది గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సూపర్‌వైజర్ చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి రాధ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, ఆశా కార్యకర్తలు పద్మావతి, వాణిబాయి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పట్టణంలో నాయి బ్రాహ్మణ నూతన కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పడింది. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ వి రమణ, కోశాధికారిగా జయచంద్రను ఎన్ను కున్నారు. మరో 42 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. త్వరలో మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ తమపైన నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కదిరి టౌన్ : స్వచ్ఛత హి సేవ లో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. శుక్రవారం కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్ల పల్లిలో ఎంపీడీవో అంజినప్ప అధ్యక్షతన స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ సత్య సాయి జిల్లా లీడ్ మేనేజర్ ఏవి రమణ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రలో భాగంగా ప్రజా శ్రేయస్సు కోసం కార్మికుల నిత్యం పనిచేస్తుంటారని అన్నారు. పారిశుధ్య కార్మికులు ఆర్థికంగా ఎదగడటానికి బ్యాంకులు నుండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక భద్రత స్కీములు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిక్కీ రాయలసీమ కోఆర్డినేటర్ రమణ, ఆర్థిక అక్షరాస్యత జిల్లా కోఆర్డినేటర్ వీర మారుతి , పుట్టపర్తి కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ , కెనరా బ్యాంక్ సిబ్బంది బాలచంద్ర, కుమ్మరి వాల్లపల్లి గ్రామ సచివాలయం పంచాయతీ సెక్రటరీ పద్మజ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు



విజేత విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపి బికె పార్థసారథి

క్రీడలతో మానసికోల్లాసం : ఎంపి

ప్రజాశక్తి-రొద్దం

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపి బికె.పార్థసారధి తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం మానసిక ఉల్లాసనికి ఎంతో అవసరం అన్నారు. చదువులో కూడా లక్ష్యం నిర్దేశించుకుని ముందుకెళ్లాలన్నారు. తాను కూడా ఇదే పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకొన్నానని తెలిపారు. ఆ రోజుల్లో ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధుల వల్ల ఈ రోజు ఈ స్థాయికి ఎదిగానన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల కొరత ఉందని ఉపాధ్యాయులు తెలుపగా స్పందించిన ఆయన పాఠశాల అభివృద్ధికి ఎంపి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో మెడల్స్ పొందిన విద్యార్థులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ, పాఠశాల హెచ్‌ఎం, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, రామకృష్ణ, మండల నాయకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కల్లుమర్రి జడ్పీ హైస్కూల్‌లో సర్పంచి గంగమ్మ నాగరాజు మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 పోటీల్లో విద్యార్థులు, 16 పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బాలురకు స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం గోవిందప్ప ప్రారంభించారు. యోగా, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించారు. అండర్-17 హై జంప్‌లో పిఆర్.విజయ్‌కుమార్, లాంగ్ జంప్, ఖోఖోలో మహేష్‌కుమార్, 200 మీటర్ల షాట్‌పుట్‌లో విజయ్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు సాయికృష్ణ, అజారుద్దీన్, కొండప్ప తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఓంప్రకాష్‌రెడ్డి, విజయకుమారి, బాలు, విగ్నేష్, గౌరీ, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

హిందీకి విస్తృత ప్రచారం కల్పిద్దాం

ప్రజాశక్తి- పెనుకొండ

రాజభాష అయిన హిందీ భాష మాధ్యమానికి విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం హిందీ దివస్ కార్య నిర్వాహక కమిటీ కన్వీనర్ జాబిలి చాంద్ బాషా అధ్యక్షతన హిందీ దినో త్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జాతిని సమైక్యపరచి భారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించ డంలో హిందీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మగాంధీ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు హిందీ భాషను ప్రధాన ఆయుధంగా చేసుకున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో మాతృభాషలను కాపాడుకుంటూనే జాతీయ స్థాయిలో హిందీ భాష కనుమరుగు కాకుండా రక్షించుకోవాలని సూచించారు. జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ విద్యార్థుల్లో హిందీ భాషపై మక్కువ పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలెన్నో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులంతా ఒకే వేదికపై కలిసి హిందీ భాష దినోత్సవం నిర్వహించుకోవడం శుభ పరిణామమన్నారు. భవిష్యత్తులో హిందీ భాషకు మరింత ప్రచారం కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రవిశంకర్ గురూజీ, ఎంఇఒ చంద్రశేఖర్, యుటియఫ్ నాయకుడు సుధాకర్, ఎపిటిఎఫ్ నాయకుడు కె.శ్రీనివాసులు, తదితరులు ప్రసంగించారు. అనంతరం హిందీ భాష సేవకులతో పాటు ఉపాధ్యాయులను హిదీ భాష సేవా పురస్కారాలతో సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కో కన్వీనర్ యాస్మిన్, సభ్యులు రవీంద్ర, తాహిర్‌వలి, మహమ్మద్ యాసిన్, జహీరుద్దీన్, ప్రసన్న, ఎం.జయచంద్ర, గిరి, వరప్రసాద్, హెప్సిబా గ్రేస్, సుకన్య పాల్గొన్నారు.

హిందీ దివస్‌లో మంత్రి సవిత



హిందీ ఉపాధ్యాయులకు బహుమతులు అందజేసిన మంత్రి సవిత

జాడలేని వర్షాలు.. ఎండుతున్న పంటలు

గుడిబండ : మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 80 శాతం రైతాంగం వేరుశనగ పంట సాగు చేస్తారు. లక్ష లాది రూపాయలు వెచ్చించి పంట సాగు చేస్తున్నారు. అయితే ఏటా అతివృష్టి, అనావృష్టి ఏదో ఒక కారణంగా పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది ముంగారు వర్షాలు ప్రారంభం కాగానే చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా ప్రయివేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసి ముందుగానే పొలాలను దుక్కి చేసుకున్నారు. రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ఆలస్యం కావడంతో అదును దాటిపోతుందనే ఉద్దేశంతో బయట విత్తన వేరుశనగ కొనుగోలు చేసి విత్తనం వేశారు. ప్రారంభంలో వర్షాలు బాగా కురిసినా ఆ తర్వాత చినుకు జాడ లేకపోవడంతో పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతంలో చాలా మంది రైతులు వేరుశనగ పంటను నమ్ముకుని ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.



ఎండిన వేరుశనగ పంట

ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం'



హిందూపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అమడగూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అనేక సంస్కరణలు చేపట్టిందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పూలకుంట్లపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు గ్రామంలోని పాఠశాలను సందర్శించి పిల్లలకు పాఠాలు బోధించి పాఠశాల అవరణంలో మొక్కలు నాటారు. సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి, నాయకులు కందుకూరి కృష్ణమూర్తి, కుమార్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత కూటమి ప్రభుత్వం అనిపించుకుంటోందని కూటమి నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో, రూరల్ మండలంలోని గోళాపురంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత చేసిన పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా, కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, దుర్గ మంజుళ, నాయకులు ప్రెస్ వెంకటేష్, అంజాద్, నిమ్మకాయల రాము, దేశాయి మురళి, దుర్గా నవీన్, షబ్బీర్, అంజి, మల్లన్న, తదితరులు పాల్గొన్నారు. రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, మాజీ జెడ్‌పిటిసి ఆదినారాయణ, కుటమి నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : 'ఇది మంచి ప్రభుత్వం', ప్రజల చేత ఎంచుకున్న కూటమి ప్రభుత్వం అని కూటమి నాయకులు తెలిపారు. పట్టణంలోని ఆల్విన్‌కాలనీ, శెట్టిపల్లి గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ హామీ మేరకు కూటమి ప్రభుత్వం పింఛను మొత్తం పెంచిందని, అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని, మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పించిందన్నారు. ఇంటింటికీ తిరుగుతూ వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, రఘువీరాచౌదరి, రామలింగ, లక్ష్మీదేవి, రమణమ్మ, పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో ప్రభుత్వ అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నాలుగో వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వంలో వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ పథకాలు, విజయాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, ఈవో బాబురావు, మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు వేణు, డీలర్ అజంతుల్లా, నాగరాజు, ఉమర్‌ఖాన్, బొబ్బిలి రామ్మోహన్, సోమశేఖర్, జనసేన పార్టీ నేత వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకురాలు

సోమందేపల్లి : మండలంలోని కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను విడుదల చేశారు. గాంధీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సరస్వతి, ఈఓఆర్‌డి శ్రీధర్, టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, నాయకులు చంద్రశేఖర్, వెంకటరాముడు, వెంకటేశులు, చల్లాపల్లి రామకృష్ణ, సంజీవరెడ్డి, భానుకిర్తి, సర్పంచి నరసింహులు, సురేష్, సిసి హరి, హరికృష్ణ, జనసేన నాయకులు నాగరాజు, బాబయ్య, ఆనంద్, అంజి, లవ్లీ సతీష్, హేమంత్, మన్సూర్, రమేష్, శంకర, తుమకుంట బాలు, రమేష్, లక్ష్మీనారాయణ, కార్యదర్శి రామాంజనేయులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రావులచెర్వులో గ్రామసభ

ధర్మవరం రూరల్ : 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రావులచెర్వులో అధికారులు గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి గోపాల్ నాయక్, సచివాలయ సిబ్బంది, టి డి పి నాయకులు పంచాయతీ లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసినకార్యక్రమాల గురించి తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు.



పెనుకొండలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సోమందేపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గోరంట్లలో 'ఇది మంచి ప్రభుత్వం' పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు